సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024



గ్రామాల్లో గస్తీదళాలు

కోనరావుపేట(వేములవాడ): మర్తనపేటలో గ్రామ రక్షక దళాలకు మాజీ సర్పంచ్ తిరుపతిగౌడ్ కర్రలు, టార్చిలైట్లు పంపిణీ చేశారు. సీఐ కిరణ్‌కుమార్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అశ్విత



సిరిసిల్లకల్చరల్: వెంకంపేటకు చెందిన కుల్ల అశ్విత రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అశ్విత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/18.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వృద్ధులు కొంత ఆస్తి తమతో ఉంచుకోవాలి



డైరీ ఆవిష్కరిస్తున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

సిరిసిల్లకల్చరల్: వృద్ధాప్యంలో అవసరాల కోసం కొంత ఆస్తిని తమతో ఉంచుకోవాలని ఆర్డీవో ఆనంద్‌కుమార్ సూచించారు. ఆల్ సీనియర్ సిటిజన్స్ సంఘం రూపొందించిన డైరీ, ద్వైమాసిక పత్రికను గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. స్వార్థం నిండిన సమాజంలో వయోవృద్ధులు భవిష్యత్ అవసరాల దృష్ట్యా కొంత ఆస్తిని తమతో ఉంచుకోవాలన్నారు. ఉన్నదంతా వారసుల పేరిట పంచి పెట్టడం సరికాదన్నారు. సంఘం ప్రతినిధులు చేపూరి బుచ్చయ్య, డాక్టర్ జనపాల శంకరయ్య, ఏనుగుల ఎల్లయ్య, దొంత దేవదాస్, గజ్జెల్లి రాంచంద్రం, కోడం నారాయణ, గుడ్ల శ్రీధర్, ఇరుకుల్ల భాస్కర్, నక్క మనోహర్, సజ్జనం విద్యాసాగర్, పులి రమేశ్ పాల్గొన్నారు.

ఉదయమే పనిలోకి వెళ్లాలి



పోతుగల్‌లో మాట్లాడుతున్న డీఆర్‌డీవో

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఉపాధిహామీ కూలీలు ఎండాకాలంలో ఉదయమే పనిలోకి వెళ్లాలని డీఆర్‌డీవో శేషాద్రి సూచించారు. ముస్తాబాద్ మండలం పోతుగల్, తుర్కపల్లి, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో ఉపాధిహామీ పనులను గురువారం పరిశీలించారు. కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.272 వస్తాయని తెలిపారు. ఖండిత కందకాలతో భూగర్భ జలాలు పెంపొందుతాయన్నారు. ఎంపీడీవోలు భాస్కరశర్మ, సత్తయ్య, ఏపీవోలు ఆనంద్‌మోహన్, కొమురయ్య, టీఏలు రమేశ్, కనకరాజ్, ప్రత్యేకాధికారి భూంరెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ నవత తదితరులు పాల్గొన్నారు.

ఫాజుల్‌నగర్ చేరిన ఎల్లంపల్లి నీరు

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండలం ఫాజుల్‌నగర్ ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నీరును గురువారం వదిలిపెట్టారు. కొన్ని రోజులుగా నీరు లేక పొలాలు ఎండిపోవడంతో విషయాన్ని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి ఈ ప్రాంత రైతులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి నీటి విడుదలకు తనవంతు కృషి చేశారు.

పరిశోధన పద్ధతులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ లావణ్య

వేములవాడరూరల్: సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపించేలా విద్యార్థులు పరిశోధనలు చేయాలని కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కామర్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.లావణ్య పేర్కొన్నారు. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం పరిశోధన పద్ధతులు, ప్రాజెక్ట్ రిపోర్ట్ అనే అంశంపై మాట్లాడారు. చుట్టూ ఉన్న సామాజిక సమస్యలను పరిశోధనాంశంగా తీసుకుని పరిష్కార మార్గాలు కనుగొనాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కామర్స్ విభాగాధిపతి మల్లారెడ్డి, అకాడమిక్ సమన్వయకర్త మధు రాజేశ్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నేడు ర్యాలీ

సిరిసిల్లకల్చరల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం బంద్ పిలుపు నేపథ్యంలో ప్రభుత్వ కళాశాల మైదానం నుంచి ఆర్డీవో ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజ్జ వేణు, కడారి రాములు తెలిపారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్మిక సంస్థల ప్రైవేటీకరణ ప్రయత్నాలు నిరసించారు. జీఎస్టీ పేరుతో నిరుపేదలైన కార్మికులపై భారం పడుతోందన్నారు. ఎల్ఐసీ, సింగరేణి, రైల్వే ఉద్యోగ సంఘాలను ప్రైవేటీకరించే విధానాలు ఉపసంహరించుకోవాలని కోరారు. ఏఐటీయూసీ గోనె ఎల్లప్ప, గాజుల విద్యాసాగర్ పాల్గొన్నారు.

బై నంబర్లతో పరిహారం !

- పాత ఇళ్లకే మళ్లీ పరిహారం కోసం ప్రయత్నాలు
- 9 ఇళ్లకు బై నంబర్లతో ప్రయత్నం
- గ్రామస్తుల ఫిర్యాదుతో అడ్డుకున్న అధికారులు
- ప్రభుత్వం మార్పు, ఎస్డీసీకి ఫిర్యాదుతో వెలుగులోకి..
- వరదవెల్లిలో ఇటీవల డీపీవో విచారణ
- విచారణ కొనసాగుతోంది : సిరిసిల్ల ఆర్డీవో



వరదవెల్లి అనుబంధ రాజన్నపేట ముంపు గ్రామం

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు బాధితుల రూపంలో అదనంగా కోటి రూపాయల పరిహారం పొందేందుకు కొందరు చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. గతంలోనే ఉన్న ఇళ్లకు బై నంబర్లు సృష్టించి ఇళ్ల ముంపు పరిహారం పొందేందుకు కొందరు చేసిన కుట్రలు బయటపడ్డాయి. ప్రభుత్వం మారడం, గ్రామస్తుల ఫిర్యాదుతో భారీ ఎత్తున స్వాహా చేసేందుకు చేసిన కుటిల ప్రయత్నాలు ఆలస్యంగా వెలుగుచూశాయి.

మిడ్‌మానేరులో 12 ముంపు గ్రామాలు

బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన మిడ్‌మానేరు ప్రాజెక్టులో 12 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఇందులో వరదవెల్లి ఒకటి. వరదవెల్లితోపాటు అనుబంధ గ్రామ నిర్వాసితులకు పలు రకాల పరిహారాలు అందాయి. కొందరు అత్యాశతో గతంలో పరిహారం పొందిన ఇళ్లకు బై నంబర్లు ఉన్నట్లు రికార్డుల్లో చూపుతూ మరో రూ.కోటి పరిహారం పొందేందుకు ప్రయత్నించారు. గ్రామంలోని తొమ్మిది ఇళ్లకు బై నంబర్ల రికార్డులతో మళ్లీ పరిహారం పొందేందుకు ప్లాన్ వేసినట్లు అందరూ భావిస్తున్నారు. కొద్ది నెలల క్రితం పరిహారం చెక్కులు పంపిణీ చేయడానికి రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. అప్పటి వరకు అంతా సజావుగా సాగుతుందనుకున్న వారికి వారంలోనే అంతా గోల్‌మాల్ అవడంతో అవాక్కయ్యారు. గత డిసెంబర్ మొదటి వారంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మారడం.. నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం రావడం.. గతంలో ఇళ్ల పరిహారం పొంది మళ్లీ అవే ఇళ్లకు ముంపు సొమ్ము స్వాహా ప్రయత్నాలపై అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ విషయం బయటకు పొక్కింది. బై నంబర్లతో ఇళ్ల ముంపు పరిహారం అక్రమంగా పొందే కుట్రలను అడ్డుకోవాలని 2023 డిసెంబర్ 14న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు పలువురు వినతిపత్రం సమర్పించారు.

జనవరి 23న డీపీవో విచారణ

అక్రమ పరిహారం ప్రక్రియ ఆపాలని గ్రామంలోని కొందరి ఫిర్యాదుతో గత జనవరి 23న డీపీవో రవీందర్ వరదవెల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. పలు రికార్డులు పరిశీలించారు. విచారణ నివేదికను అధికారులకు అందచేస్తామని తెలిపారు. ఇటీవల డీపీవో, ఎస్డీసీ బదిలీపై వెళ్లడంతో సిరిసిల్ల ఆర్డీవోకు ఎస్డీసీ బాధ్యతలు అప్పగించారు. కాగా రూ.కోటి పరిహారం స్వాహా తతంగం వెనుక అధికారులు ఉన్నట్లు అనుమానాలు కలుగుతున్నాయి. ప్రభుత్వం ఈ విషయంలో పూర్తి స్థాయి విచారణ చేపడితే మరిన్ని నిజాలు నిగ్గు తేలే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

9 ఇళ్లకు బై నంబర్లు

వరదవెల్లి ముంపు గ్రామంలో 478 వరకు ఇంటి నంబర్లు ఉన్నాయి. 2006 నుంచి మిడ్‌మానేరు ప్రాజెక్టు ఇళ్లు, భూములను గుర్తించారు. 2014లో ముంపునకు గురయ్యే ఇళ్లకు ఎంఎంఆర్ నంబర్లు వేసి నోటీసులు ఇచ్చారు. నంబర్లు వేసిన తర్వాత నిర్మిస్తే పరిహారం వర్తించదని ఆ సమయంలో అధికారులు గ్రామస్తులకు స్పష్టం చేశారు. అయినా కొందరు ఇళ్ల పక్కకు రేకులషెడ్లు, పశువుల పాకలు వేసుకున్నట్లు సమాచారం. కాగా గత ప్రభుత్వం తప్పిపోయిన ఇళ్లకు పరిహారం ఇవ్వాలని 2021లో జీవో ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ జీవోను సాకుగా చూపి గతంలో నిర్మించిన ఇళ్ల ఇంటి నంబర్లకు తోడు పక్కకు షెడ్లకు అదనంగా బై నంబర్లు వేయించుకున్నట్లు తెలిసింది. 2022లో ఇలా 9 ఇళ్లు గెజిట్ అయినట్లు సమాచారం. ఈ 9 ఇళ్లపై కోటి రూపాయల వరకు కాజేసేందుకు ఎత్తులు వేశారు.

విచారణ కొనసాగుతోంది



వరదవెల్లి అనుబంధ గ్రామం రాజన్నపేటలో గతంలో పరిహారం పొందిన 9 ఇళ్లకు తిరిగి పరిహారం పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలో డీపీవో విచారణ చేపట్టారు. ఇంకా విచారణ కొనసాగుతోంది. పరిహారం పొందేందుకు అర్హులుగా ఉన్న వారికి న్యాయం చేయడం జరుగుతుంది.

– ఆనంద్‌కుమార్, ఆర్డీవో, సిరిసిల్ల

పలకరిస్తూ.. ఉత్సాహం నింపుతూ..



సిరిసిల్లలో అభివాదం చేస్తున్న బండి సంజయ్‌కుమార్, రాణి రుద్రమ

- కొనసాగిన బండి సంజయ్ ప్రజాహిత యాత్ర

సిరిసిల్లటౌన్/తంగళ్లపల్లి/వేములవాడరూరల్: జిల్లాలో ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ప్రజాహిత యాత్ర గురువారం ఉత్సాహంగా సాగింది. సిరిసిల్ల పట్టణంతోపాటు తంగళ్లపల్లి, వేములవాడఅర్బన్ మండలాల్లో కొనసాగింది. యాత్ర ముగింపు సందర్భంగా అగ్రహారం హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడారు. కొంపలు ముంచే భాషలు కేసీఆర్‌కే వస్తాయన్నారు. ప్రజలను దోచుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పాలన సాగిందని, అందుకే ప్రజలు తిరస్కరించారన్నారు. కొడుకు పేరు అజయ్‌రావు నుంచి తారకరామారావుగా మార్చి టికెట్ తెచ్చుకున్న చరిత్ర కేసీఆర్‌ది అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అబద్ధాలు విని విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేసి మళ్లీ మోసపోయారని విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఆరు గ్యారంటీలు అమలవుతాయని ఆశపడ్డారని.. కానీ హామీలను వారు అటకెక్కిస్తారన్నారు. కేటీఆర్‌కు 24 గంటలు ఎంపీ బండి సంజయ్‌ను తిట్టడమే పని తప్ప వేరే పని లేదన్నారు. తంగళ్లపల్లి మండలంలో పేదోడు ఇంకా పేదోడు అయితుంటే కేటీఆర్ కుటుంబం మాత్రం వేల కోట్ల ఆస్తులు సంపాదించుకుందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీలను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. అంతకుముందు తంగళ్లపల్లి ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణ భూమిపూజలో పాల్గొన్నారు.

కదలివచ్చిన కార్యకర్తలు..

సిరిసిల్లలో బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత పాదయాత్రకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. పట్టణంలో రోడ్ షో సందర్భంగా డీజే సౌండ్ సిస్టమ్‌తో కళాకారులు, ఆటపాటలతో అలరించారు. మానేరు బ్రిడ్జి శివారుకు చేరుకోగానే వేలాది సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. సెల్ఫీలు దిగడానికి పోటీపడ్డారు. మొదటగా కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాల వేశారు. గాంధీ, అంబేడ్కర్, చేనేతన్న విగ్రహాలకు పూలమాలలు వేసి అభివాదం చేశారు. బీజేపీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి రాణి రుద్రమరెడ్డి, రాష్ట్ర నాయకులు సంగప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు బర్కం లక్ష్మి, పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, నాయకులు బొల్గం నాగరాజుగౌడ్, చెన్నమనేని కీర్తి, గూడూరి భాస్కర్, కమలాకర్‌రావు, శీలం రాజు, బర్కం నవీన్, గరిపెల్లి ప్రభాకర్, గుడ్ల విష్ణు, గజభీంకార్ సంతోష్, సందెవేని రాజు తదితరులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

ఇంటర్‌లో ఇంగ్లిష్ ప్రాక్టికల్

- నేడు పరీక్ష
- హాజరుకానున్న 4211 మంది విద్యార్థులు
- గైర్హాజరైతే.. ఫెయిలైనట్టే

గంభీరావుపేట(సిరిసిల్ల): విద్యార్థులకు ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడంలో నైపుణ్యం సాధిస్తే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉంటాయి. ఆంగ్లంపై అదిరేలా మాట్లాడడం, రాయడమే లక్ష్యంగా ఈ ఏడాది నుంచి ఇంటర్‌లో ప్రయోగ పరీక్షను ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకు సైన్స్ సబ్జెక్టులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ, బోటనీలకు మాత్రమే ప్రయోగ పరీక్షలు ఉండేవి. ఇప్పటి నుంచి ఫస్టియర్ విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్టుకు ప్రయోగ పరీక్షలు అమలు చేస్తున్నారు. ఈ నెల 16న ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు జిల్లవ్యాప్తంగా 4,211 మంది ఫస్టియర్ విద్యార్థులు హాజరుకానున్నారు.

గైర్హజరైతే.. ఫెయిలైనట్టే

ఇంగ్లిష్ ప్రయోగ పరీక్షకు ఫస్టియర్ విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలి. ఒకవేళ గైర్హజరైతే విద్యార్థులు ఫెయిలైనట్టేనని అధికారులు చెబుతున్నారు. ఇంగ్లిష్ రాత పరీక్షకు 80 మార్కులు, మిగిలిన 20 మార్కులు ప్రయోగ పరీక్షకు కేటాయించారు. కనీసం ఏడు మార్కులు వస్తేనే విద్యార్థులు ఉత్తీర్ణులవుతారు.

పరీక్ష ఇలా..

- కమ్యూనికేషన్ ఫంక్షన్ అంశంపై విద్యార్థులు ఇంగ్లిష్‌లో మాట్లాడుకునే విధానాన్ని అధ్యాపకులు పరిశీలిస్తారు.
- జస్ట్ ఏ మినిట్‌లో ఒక అంశంపై నిమిషంపాటు విద్యార్థులు అనర్గళంగా మాట్లాడాల్సి ఉంటుంది.
- రోల్ ప్లేలో విద్యార్థులు గ్రూప్‌గా చర్చించాల్సి ఉంటుంది.
- లిజనింగ్ కాంప్రహెన్సివ్‌లో విద్యార్థుల గ్రహించే శక్తిని పరీక్షిస్తారు.



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

సబ్జెక్టేతర పరీక్షలు

ఈనెల 17న ఇంటర్ విద్యార్థులకు ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ సబ్జెక్టుపై ఈనెల 17న పరీక్ష నిర్వహించనున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం సెకండియర్ విద్యార్థుల్లో ఎవరైనా గతేడాది సబ్జెక్టు పరీక్ష రాయని వారికి అవకాశం కల్పించారు. జిల్లాలో 32 మంది ఈ పరీక్షకు హాజరుకానున్నారు. ఈ నెల 19న ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు పర్యావరణ విద్యపై పరీక్ష నిర్వహించనున్నారు.

హాజరు తప్పనిసరి



శుక్రవారం నిర్వహించే ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షకు ఫస్టియర్ విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలి. గైర్హజరైతే ఫెయిల్ అవుతారు. ఉన్నత విద్యలో, ఉద్యోగావకాశాల్లో ఇంగ్లిష్ సబ్జెక్టు కీలకం. అందుకే ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ప్రయోగపరీక్షను ప్రవేశపెట్టారు. విద్యార్థుల్లో ఇంగ్లిష్ సబ్జెక్టులో ప్రతిభ, సృజనాత్మకశక్తిని పెంచేలా పరీక్ష ఉంటుంది.

– సీహెచ్.మోహన్, జిల్లా ఇంటర్ విద్యాధికారి

మార్చి 3న పల్స్ పోలియో

- డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరాములు

సిరిసిల్ల: జిల్లాలో మార్చి 3న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు కోరారు. కలెక్టరేట్‌లో గురువారం పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంపై వైద్యశాఖ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. శ్రీరాములు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పసి బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు విధిగా మార్చి 3న పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఎవరైనా ఆ రోజు పోలియో చుక్కలు వేయించుకోకుండా మిస్ అయితే.. మార్చి 4, 5వ తేదీల్లో వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి వస్తారని తెలిపారు. ఆర్‌ఎస్‌బీకే పీవో డాక్టర్ నయీమ్ జాన్, హెచ్ఈవో లింగం, డిప్యూటీ డీఈఎంవో బాలయ్య, మహేశ్‌గౌడ్, హెచ్ఏలు పాల్గొన్నారు.

డీటీవో కొండల్‌రావు బదిలీ



సిరిసిల్లక్రైం: పునర్ విభజనలో ఏర్పడిన సిరిసిల్ల జిల్లాకు మొదటి నుంచి రవాణాశాఖ అధికారిగా పనిచేసిన వై.కొండల్‌రావు సిద్దిపేటలోని హుస్నాబాద్‌కు బదిలీ అయ్యారు. సిద్దిపేటలో ఎంవీఐ విధులు నిర్వహిస్తున్న వి.లక్ష్మణ్ సిరిసిల్లకు బదిలీ అయ్యారు.

ఎస్సైల బదిలీలు

సిరిసిల్లక్రైం: జిల్లాలో పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెల్లడయ్యాయి. చందుర్తి ఎస్సై వెంకటేశ్వర్లును కామారెడ్డి జిల్లా తాడ్వాయికి, ఇక్కడ పనిచేస్తున్న వి.హరీష్‌ను సిరిసిల్లటౌన్‌కు బదిలీ చేశారు. ఇల్లంతకుంట ఎస్సై డి.సుధాకర్‌ను తంగళ్లపల్లికి, ఇక్కడ పనిచేస్తున్న కె.ప్రశాంత్‌రెడ్డిని ఇల్లంతకుంటకు బదిలీ చేశారు. సిద్దిపేట కమిషనరేట్ ఎస్‌బీలో పనిచేస్తున్న ఎస్సై సీహెచ్.శ్రీకాంత్‌ను చందుర్తికి బదిలీ చేశారు. మెదక్‌లో వీఆర్‌లో ఉన్న పి.మల్లారెడ్డిని వేములవాడ టౌన్, బి.మల్లయ్య సిరిసిల్ల ఎస్బీ, పి.పోచయ్య సీసీఎస్ సిరిసిల్ల ఎస్ఐగా బదిలీపై రానున్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

సిరిసిల్ల: జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు శుక్రవారం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ గురువారం తెలిపారు. స్థాయీ సంఘాల సమావేశాలకు ఆయా సంఘాల చైర్మన్లు అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సమావేశాలు ప్రారంభమవుతాయని వివరించారు. జిల్లాలోని జెడ్పీటీసీలు, ఆయాశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

సూరమ్మ ప్రాజెక్టుకు నిధులు

- వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: సూరమ్మ–కలికోట ప్రాజెక్టు ప్రాముఖ్యతను గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డి నిధుల మంజూరుకు హామీ ఇచ్చారని, ఇందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో గురువారం వేములవాడ సమస్యలను ఆది శ్రీనివాస్ ప్రస్తావించారు. గత పదేళ్ల పాలనలో వేములవాడ నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజ్–2. ఫేజ్ 1 పనులకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.1,737 కోట్లు మంజూరు చేయగా, మరో 10 శాతం పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పనులు పూర్తయితే నియోజకవర్గంలో 43వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతుందన్నారు. సూరమ్మ చెరువు రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వలకు గత ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితమైందని విమర్శించారు. మరిపెల్లి, లచ్చపేట, లొంకచెరువు, కొత్తచెరువు, ఎర్ర చెరువు, పటేల్ చెరువులను నింపడానికి నిధులు విడుదల చేయాలని కోరారు. రాళ్లవాగు ప్రాజెక్ట్ కింద కథలాపూర్ మండలంలో 3,500 ఎకరాలకు సాగునీరు అందించే కాలువలు వర్షాకాలంలో తెగిపోయాయని, బాగు చేయాలని కోరారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

ప్రాణాలు కాపాడటంలో సీపీఆర్ కీలకం

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం/గంభీరావుపేట(సిరిసిల్ల): ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ ప్రాథమిక చికిత్సలో భాగంగా అందించే సీపీఆర్ కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణ పరిధిలోని జు–కన్వెన్షన్‌హాల్‌లో గురువారం జిల్లా పోలీస్ సిబ్బందికి, బ్లూకోల్ట్, పెట్రోకార్ సిబ్బందికి సీపీఆర్, ప్రథమ చికిత్స–బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా మొదట బొమ్మపై లైఫ్ సపోర్ట్ స్కిల్స్ గురించి డాక్టర్స్ ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, మెడిలైఫ్ హాస్పిటల్, రేనే హాస్పిటల్ వైద్యులు కుమారస్వామి, దీక్షిత్, వంశీ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. గంభీరావుపేటలోని కేజీ టు పీజీ విద్యాసంస్థల ప్రాంగణంలో గురువారం షీటీం ఆధ్వర్యంలో ఉమెన్ సేఫ్టీ, మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్, సోషల్ మీడియా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ పోకిరీలపై జాగ్రత్తగా ఉండాలని, చిన్న సంఘటన జరిగినా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని సూచించారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రామ్మోహన్, షీటీం ఏఎస్సై ప్రమీల, ప్రియాంక, ప్రధానోపాధ్యాయులు రమాదేవి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కంచెలు నిషేధం

పొలాలకు రక్షణ పేరిట, వేటలో వన్యప్రాణుల కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. మీడియాతో మాట్లాడుతూ అక్రమంగా తరచు విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణుల, ప్రజల ప్రాణాలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. గత వారం రోజుల్లో ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట, రుద్రంగి ఠాణాల పరిధిలో కేసులు నమోదైన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సంఘటనలు పదే పదే పునరావృతమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. గతంలో కోనరావుపేట మండలంలో వన్యప్రాణుల కోసం విద్యుత్ తీగలు అమర్చి ఒకరి మృతికి కారణమైన వ్యక్తిపై పీడీ యాక్ట్ అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.



శిక్షణలో పోలీసు సిబ్బంది

ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ

- సిరిసిల్లలోనే ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్
- ఆర్డీవో ఆనంద్‌కుమార్

సిరిసిల్ల: ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సవరణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో ఆనంద్‌కుమార్ తెలిపారు. సిరిసిల్లలోని తన కార్యాలయంలో గురువారం అన్ని రాజకీయ పక్షాలతో సమావేశమయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గ ఓటింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌ను సిరిసిల్ల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నామినేషన్లు, ఓట్ల లెక్కింపు కరీంనగర్‌లో ఉంటుందని, సామగ్రి పంపిణీ, స్వీకరణ సిరిసిల్ల జూనియర్ కళాశాలలో ఉంటుందని వివరించారు. ఫిబ్రవరి 8 నాటికి నమోదైన ఓటర్ల జాబితా వివరాలను అఖిల పక్షనేతలకు తెలిపారు. డూప్లికేట్ ఓటర్లుగా ఉన్న వారిని ఫామ్–7 నోటీసు జారీ చేసి తొలగించామని ఆర్డీవో స్పష్టం చేశారు. అఖిలపక్షం నాయకులు లింగంపల్లి మధుకర్(బీఎస్పీ), గజభీంకార్ రాజన్న(బీఆర్ఎస్), బి.సంపత్(కాంగ్రెస్), ఈ.ప్రవీణ్ (బీజేపీ), ఎండీ హైమద్(ఎంఐఎం) ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడండి

- జెడ్పీ సీఈవో ఉమారాణి

బోయినపల్లి(చొప్పదండి): వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జెడ్పీ సీఈవో ఉమారాణి పేర్కొన్నారు. మండలంలోని తడగొండ, మల్కాపూర్, మాన్వాడ గ్రామాల్లో జెడ్పీ నిధులతో చేపట్టిన పనులను గురువారం పరిశీలించారు. ఉమారాణి మాట్లాడుతూ ఎంబీ రికార్డుల ఆధారంగా బిల్లులు చెల్లించాలని సూచించారు. డిప్యూటీ సీఈవో గీత, ఎంపీడీవో జయశీల, ఈజీఎస్ ఏపీవో వనం సబిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్రవంతి, ఆరిఫ్, గడ్డం శ్రీనివాస్ ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న సీఈవో ఉమారాణి

క్లుప్తంగా

బావిలో పడి వృద్ధురాలి మృతి


లక్ష్మి మృతదేహం

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని లింగన్నపేటకు చెందిన వృద్ధురాలు బరుకుటం లక్ష్మి(65) ముస్తఫానగర్ శివారులోని ఓ బావిలో పడి మృతిచెందింది. లక్ష్మి భర్త ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందాడు. కుమారుడు మూగవాడు. ఓ రైసుమిల్లులో కూలీ పనులు చేసుకుంటున్నాడు. లక్ష్మి ఇంటిదగ్గర ఒంటరిగానే ఉంటుంది. కొంతకాలంగా మతిస్థిమితం లేదు. గురువారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లిన లక్ష్మి మధ్యాహ్నం బావిలో శవమై కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. జీవితంపై విరక్తితోనే బావిలో దూకి ఆత్మహత్య చేసుకొని ఉంటుందని కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి కరీంనగర్ కోర్టు జైలు శిక్ష, జరిమానాలు విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మహ్మద్ సర్వర్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 22 మందిని కరీంనగర్ కోర్టులో గురువారం హాజరుపర్చగా ఒకరికి పదిరోజుల జైలు, మరొకరికి ఏడు రోజుల జైలు, మరో వ్యక్తికి మూడు రోజుల జైలుతో పాటు రూ.6వేల జరిమానా విధించారన్నారు. మిగతా 19 మందికి 33,500 జరిమానా విధించినట్లు ఏసీపీ తెలిపారు.

ఇన్‌స్పైర్‌మనక్ ఎగ్జిబిషన్‌కు పారమిత విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

కరీంనగర్: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్‌లో పదోతరగతి చదువుతున్న సిద్రా రహ్మత్, శుభశ్రీ సాహులు 2023–24 విద్యాసంవత్సరానికిగానూ ఈ నెలాఖరులో జరగనున్న రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రితేష్ మెహతా తెలిపారు. విద్యార్థులను, గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహు పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, రాకేశ్ అభినందించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- చట్టపరంగా ముందుకెళ్తాం
- ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కావొద్దు
- హెచ్చరించిన రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు


కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, మెడికోలు

కోల్‌సిటీ(రామగుండం): 'రామగుండం సీపీగా బాధ్యతలు తీసుకున్న రోజునే మెడికల్ కాలేజీలో జరిగిన ర్యాగింగ్ ఘటన నన్ను కలిచివేసింది. మెడికోలకు అవగాహనలు, కౌన్సెలింగ్‌లు, సలహాలు ఇవ్వడం కాదు.. ఇదే లాస్ట్ కావాలి. ఇలాంటి ఘటనలు మరోసారి కాలేజీలో పునరావృతం కావొద్దు. మెడికోలకు ఇది వార్నింగ్. ర్యాగింగ్ చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు' అని సున్నితంగా మెడికోలను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు హెచ్చరించారు. గోదావరిఖనిలోని ప్రభుత్వ సిమ్స్ కాలేజీలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో 'యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్ అవేర్‌నెస్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడిన తీరు ఆలోచింపజేసింది. 'జూనియర్లకు సీనియర్లు ఒక అన్నలా ఉండాలి కానీ.. ఫన్, ఆకతాయి కోసం ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తును చేతులారా పోగొట్టుకున్నవారవుతారు. ఒక్కసారి శిక్షకు గురైతే పాస్‌పోర్ట్, వీసా కూడా రాదు. ఏ కాలేజీలో అడ్మిషన్ ఇవ్వరు' అని వివరించారు. తనకు కూడా డాక్టర్ కావాలని చాలా ఆశ ఉండేదని, స్టెతస్కోప్ పట్టాలనుకున్న చేతులోకి గన్ వచ్చిందన్నారు. ప్రజలకు ప్రాణం పోయడానికి, డాక్టర్ వృత్తిని ఎంచుకోవడానికి పోటీపడి చదివి ఉచిత సీటుతో మెడికల్ కాలేజీకి వచ్చిన విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో భవిష్యత్తును పాడుచేసుకోవద్దని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్మించడంలో కళాశాల క్యాంపస్ కీలక పాత్రపోషిస్తుందని, ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా మార్చడానికి విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కాలేజీలో ప్రత్యేక పోలీస్ టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని కాలేజీల్లో షీ టీమ్ బృందాలు మఫ్టీలో తిరుగుతూ, నిరంతర నిఘా ఉంటుందని వివరించారు. యాంటీ ర్యాగింగ్‌పై చట్టాలు, శిక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం 'వార్నింగ్.. ర్యాగింగ్ నేరం' అనే పోస్టర్‌ను సీపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీపీ డాక్టర్ ఎం.చేతన, కాలేజీ ప్రిన్సిపాల్ హి మబిందు సింగ్, పెద్దపల్లి సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.జ్యోతి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ అడ్వకేట్ శ్రీనివాస్, సీడీపీవో కమలాకర్, సీఐలు ప్రమోదరావు, ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు, మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు, మెడికోలు పాల్గొన్నారు.



ర్యాగింగ్‌పై హెచ్చరిస్తున్న సీపీ శ్రీనివాసులు

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

- హైదరాబాద్‌లో ఘటన
- మృతుడిది కోరుట్ల పట్టణం


అజయ్ (ఫైల్)

కోరుట్ల: హైదరాబాద్‌లోని మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోరుట్ల పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వనతడుపుల అజయ్ (26) మృతిచెందారు. మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. పట్టణానికి చెందిన అజయ్, శ్రీపాద సుశాంక్, అందె అజయ్ స్నేహితులు. బుధవారం రాత్రి విందుకు వెళ్లిన ముగ్గురు ఒకే బైక్‌పై తిరిగి వస్తుండగా హైదరాబద్‌లోని మాదాపూర్ శివారులో బైక్ అదుపు తప్పడంతో రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో అజయ్ అక్కడికక్కడే మృతిచెందారు. సుశాంక్ తీవ్రంగా గాయపడ్డాడు. అజయ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అజయ్, సుశాంక్ హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నారు. అజయ్ పట్టణానికి చెందిన లహరిని రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు. అజయ్ కొంతకాలం క్రితం ఖతార్ వెళ్లి వచ్చాడు. యూరఫ్ వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాడు. అజయ్ మృతి చెందడం.. మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉండటం పట్టణంలో విషాదం నెలకొంది.

రామగుండం ఎఫ్‌సీఎల్‌లో ప్రమాదం

- కాంట్రాక్టు కార్మికుడికి తీవ్రగాయాలు



ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండం ఫర్టిలైజర్స్ లిమిటెడ్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. కార్మిక సంఘాల నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మొదటి షిఫ్ట్‌లో ప్లాంట్ షట్‌డౌన్ పనుల్లో భాగంగా మెకానిక్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు పి.శ్రీనివాస్ జారి కిందపడడంతో తీవ్రగాయాలైనాయి. క్షతగాత్రున్ని కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా కాంట్రాక్ట్ కార్మికులకు భద్రత లేకుండా, వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. కర్మాగారంలో క్వాలిఫైడ్ సేఫ్టీ అధికారులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై శుక్రవారం ఆర్ఎఫ్‌సీఎల్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులతో సేఫ్టీ అధికారులు సమావేశం నిర్వహించనున్నారు. ప్రమాదంపై పూర్తిస్థాయిలో విచారణ చేసేందుకు కార్మికులకు సమాచారం అందించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి...

కర్మాగారంలో క్వాలీఫై సేఫ్టీ అధికారులు లేకపోవడంతో ప్రమాదం సంభవించిందని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ఆరోపించారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులైన అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

- పిల్లలను ఎత్తుకెళ్లే వ్యక్తిగా అనుమానించిన గ్రామస్తులు
- వెంబడించడంతో పొలాల మీదుగా పారిపోయిన వైనం


పారిపోతున్న అనుమానిత వ్యక్తి

గొల్లపల్లి: మండలంలోని వెన్గుమట్లలో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అనుమానాస్పదంగా గ్రామస్తులకు కన్పించాడు. చిన్నపిల్లలను ఎత్తుకెళ్లే వ్యక్తిగా అనుమానించి వెంబడించగా పొలాల్లోంచి పరుగులు తీశాడు. గ్రామానికి చేరుకున్న సదరు వ్యక్తిని గమనించిన స్థానికులు ప్రశ్నించగా సమాధానం చెప్పకుండానే అక్కడినుంచి వెళ్లిపోయాడు. గ్రామస్తులు వెంబడించడంతో పరుగులు తీశాడు. వెంటనే గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని ఆరా తీసి కొద్దిసేపటికి పట్టుకున్నారు. అతడిని ఆరాతీసి సిద్దిపేట ప్రాంతానికి చెందిన శ్రీకాంత్‌గా గుర్తించామని, మతిస్థిమితం సరిగా లేకనే ఇలా తిరుగుతున్నాడని, పిల్లలను ఎత్తుకెళ్లే ముఠా వ్యక్తి కాదని ఎస్సై సతీశ్ బాబు తెలిపారు. గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు చొరబడితే వెంటనే తమకు సమాచారం అందించాలని 100, లేదా 87126 56826 సంప్రదించాలని కోరారు.

పోస్టుమార్టం అడ్డుకున్న కుటుంబ సభ్యులు

గన్నేరువరం: గుండ్లపల్లికి చెందిన పంబాల కొమురయ్య బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతిపై అనుమానాలు ఉన్నాయని పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరుతూ కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం కాకుండా కుటుంబసభ్యులు గురువారం అడ్డుకున్నారు. మృతిచెందిన ప్రదేశంలో చెప్పులు, కళ్లద్దాలు, దుస్తువులు వేర్వేరు చోటా పడి ఉన్నాయని, అంతే కాకుండా మోచేతులు, నుదుటిపై గాయాలయ్యాయని, గ్రామానికి చెందిన ఓవ్యక్తి తన తండ్రిని పనికి తీసుకెళ్లాడని, అక్కడ విద్యుత్ షాక్‌తో మృతిచెందిన అనంతరం శవాన్ని మా పొలంలో వేశారని ఆరోపించారు. అతని పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చాలని కోరుతూ సీపీ అభిషేక్ మహంతిని కలిశారు. ఫిర్యాదు ఆధారంగా పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట ఆందోళన

మెట్‌పల్లి: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి వైద్యుల తీరును నిరసిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన చిన్నమల్లయ్య (65)కు ఈనెల 12న ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స అందించే క్రమంలో పరిస్థితి విషమించింది. వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌కు తరలిస్తుండగా.. మృతిచెందాడు. అయితే అతడి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు ఆసుపత్రికి వద్దకు వచ్చి ఆందోళన చేశారు. ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

చేపల వలకు చిక్కిన పాము


వలలో చిక్కిన జెరిపోతును రక్షిస్తున్న సందీప్

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామంలో చేపలవలలో పాము చిక్కింది. గ్రామానికి సందీప్‌యాదవ్ గ్రామంలోని మిడ్ మానేరు ప్రాజెక్టు ఉపకాల్వ8 వద్ద బుధవారం చేపలను పట్టిన అనంతరం వలను కాల్వ పక్కన చెట్టు వద్ద పెట్టి వెళ్లిపోయాడు. చేపల వాసనకు జెరిపోతు వలలోకి దూరింది కానీ అందులోంచి బయటకు రాలేకపోయింది. గురువారం చేపలు పట్టడానికి ఉపకాల్వ వద్దకు చేరుకున్న సందీప్ పామును గమనించాడు. వెంటనే వలను కత్తిరించి పామును రక్షించాడు. సందిప్‌యాదవ్ చేపలను పట్టడమే కాకుండా ప్రమాదంలో ఉన్న విషసర్పాలను కాపాడిన సంఘటన చాలా ఉన్నాయి.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


శిక్షణ కార్యక్రమానికి హాజరైన మహిళలు

గన్నేరువరం: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని నాబార్డు ఏజీఎం, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జయప్రకాశ్ అన్నారు. మండలంలోని జంగపల్లిలో గురువారం నాబార్డు సౌజన్యంతో జనవికాస గ్రామాణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వశక్తి మహిళలకు ఫ్లవర్ బొకే తయారీపై ఎంఈడీపీ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ... ప్రస్తుతం ఫ్లవర్ బొకేకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ ఉందని, పుట్టిన రోజు, పెళ్లిళ్లు, ఈవెంట్ మేనేజ్మెంట్, ఇతర రాజకీయ పార్టీల కార్యక్రమాలకు వీటి అవసరం ఎక్కువ ఉంటుందని తెలిపారు. బంచ్, హ్యాండ్, బాస్కెట్, చాక్లెట్ , టేబుల్, వాల్ బొకేస్, టైప్స్ ఆఫ్ వెనిస్ ఫ్లవర్ జడ మొదలగు వాటిపై 15 రోజుల పాటు 30 మంది స్వశక్తి మహిళలకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం స్టడీ మెటీరియల్, రూ.750, సర్టిఫికెట్స్ కూడా అందజేయడం జరుగుతోందన్నారు. మంచి ఆదాయ మార్గాలనే అన్వేషించాలని తెలిపారు. కార్యక్రమంలో జనవికాస గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యదర్శి పెండ్లి సంపత్‌కుమార్, మాస్టర్ ట్రైనర్ షకీల్, మనీషా, అనూషరెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ గంప వెంకన్న, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి ఒకరి ఆత్మహత్య


కమల్‌గౌడ్ (ఫైల్)

వెల్గటూర్: మండలంలోని కోటిలింగాల వద్దగల గోదావరిలో దూకి మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మ్యాదరిపేటకు చెందిన బత్తిని కమల్‌గౌడ్ (29) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కమల్‌గౌడ్ షార్ట్ ఫిల్మ్స్ తీస్తుంటాడు. ఈనెల 13న తనకు డేటా ఎంట్రీ ఉద్యోగం వచ్చిందని తండ్రి వద్ద రూ.70వేలు, బంధువు వద్ద రూ.44,500 తీసుకుని ఇంటి నుంచి బయల్దేరాడు. అదేరోజు రాత్రి వరుసకు అల్లుడైన ఆకుల పవన్‌కు ఫోన్ చేసి తన డబ్బులు హ్యాక్ అయ్యాయని తెలిపాడు. రెండురోజుల అనంతరం కోటిలింగాల వద్దగల పుష్కరఘాట్ వద్ద శవమై కనిపించాడు. షార్ట్‌ఫిల్మ్స్ లొకేషన్ కోసం వచ్చి ప్రమాదవశాత్తు గోదావరిలో పడి మరణించాడా..? లేక డబ్బులు పోయాయనే మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్నాడా..? అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు మొత్తం పోవడంతోనే ఇంటికెలా వెళ్లాలనే మనోవేదనతో గోదావరి నదిలో దూకి మృతిచెందాడని తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరించండి

- జెడ్పీ సీఈవో ఉమారాణికి వినతి



సిరిసిల్లఎడ్యుకేషన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాకు పంపిన ఉపాధ్యాయుల ఖాతా వివరాలు ఆన్‌లైన్ చేయడాన్ని స్వాగతిస్తున్నామని కానీ కొన్ని సమస్యలు ఉన్నాయని జెడ్పీ సీఈవో ఉమారాణి దృష్టికి ఉపాధ్యాయ నాయకులు తీసుకెళ్లారు. ఈమేరకు గురువారం కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. కుటుంబ అవసరాల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న లోన్‌లు, పార్ట్ ఫైనల్ చెల్లింపులు ఇప్పటి వరకు కొత్త జిల్లా నుంచి చెల్లించబడలేదన్నారు. జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఖాతాల వివరాలను ఆన్‌లైన్ చేశారని, మిగతా జిల్లాల్లో కూడా త్వరగా చేయాలని కోరారు. డిప్యూటీ సీఈవో మచ్చ గీత, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, రామనాథ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, జిల్లా కార్యదర్శి దబ్బెడ హనుమాండ్లు, నాయకులు బూస రాజేందర్, దరిపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులను అణచివేస్తున్న కేంద్రం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని, పన్నులు విధిస్తూ దోపిడీకి పాల్పడుతుందని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఎల్లారెడ్డిపేటలో రైతులతో కలిసి గురువారం ఆందోళన చేశారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎరువులపై సబ్సిడీలు ఇవ్వడం లేదన్నారు. ధాన్యం ధరలు పెంచడం లేదన్నారు. పంజాబ్, హర్యానా రైతులను ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన తెలపకుండా వాటర్ క్యాన్లను సోప్ బాంబులను రైతులపై వినియోగించడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు లింగంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, దేవయ్య, బుచ్చాగౌడ్, మల్లారెడ్డి, రాజేందర్, ఎండీ రఫీ, చెన్ని బాబు, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఏటీఎం చోరీ నిందితుడి అరెస్ట్

- పరారీలో మరో ముగ్గురు

జ్యోతినగర్(రామగుండం): గోదావరిఖనిలోని గౌతమినగర్ ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ చేసి నగదు అపహరించిన కేసులో హర్యానాకు చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. వివరాలు.. ఈ నెల 10న ఎస్‌బీఐ ఏటీఎంలోకి దొంగలు చొరబడి ధ్వంసం చేసి అందులోని రూ.27,59,900 అపహరించిన ఘటనలో చానల్ మేనేజర్ గాండ్ల రమేశ్ ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు బృందాలుగా దర్యాప్తు ముమ్మరం చేశారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుల కదలికలను అనుసరిస్తూ 12న హర్యానా వెళ్లి నూహ జిల్లా నెహదా గ్రామానికి చెందిన హకుమొద్దీన్(33) అలియాస్ హక్కును అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు షోకెం ఖాన్, అమీర్‌ఖాన్, వసీంఖాన్ పారిపోయారు. విచారణ అనంతరం హకుమొద్దీన్‌ను రిమాండ్ చేసినట్లు సీఐ వెల్లడించారు. పట్టుబడిన నిందితుడి వద్ద ఎలాంటి నగదు లభించలేదని తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో శ్రమించిన అధికారులు, సిబ్బందిని పెద్దపల్లి డీసీపీ డాక్టర్ చేతన అభినందించారు.

శివాలయంలో చోరీ

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్‌లోని శ్రీకోదండరామాలయ ప్రాంగణ శివాలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీని పగులగొట్టి అందులోని సొత్తును ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం వేకువజామున ఆలయానికి వెళ్లిన భక్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా గత కొద్ది రోజులుగా బసంత్‌నగర్‌లో వరుస దొంగతనాలు స్థానికులను కలవరపెడుతున్నాయి. ఇంటి ముందర, బస్టాండ్‌ల వద్ద పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను దుండగులు ఎత్తుకెళ్తున్నారు. గడిచిన 15 రోజుల వ్యవధిలో మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనాయి. గ్రామాల్లో సీసీ కెమెరాల నిర్వహణ, రాత్రివేళల్లో పోలీసుల గస్తీ కూడా లేకపోవడంతో దొంగలు చెలరేగిపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రాత్రివేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ నజీరా(20) అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల వివరాలు.. కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఈ నెల 14న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. చుట్టు పక్కల వారు గమనించి జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తల్లి షేక్ హైదర్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

విద్యుత్ మోటార్ చోరీ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెకు చెందిన ఓ రైతు మోటార్‌ను ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. రైతు ఎడ్ల లక్ష్మీనారాయణకు చెర్లపల్లి శివారులో రెండెకరాలు ఉంది. ఈనెల 13న పొలానికి నీరు పెట్టి వచ్చాడు. మరుసటి రోజు వెళ్లగా.. బావిలో మోటార్ కనిపించలేదు. బాధితుడికి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌతంపవార్ తెలిపారు.

గల్ఫ్ ట్రావెల్స్‌లపై నిఘా కరువు

- జిల్లాలో అర్హత లేని ట్రావెల్స్‌లు అనేకం
- ఏజెంట్ల చేతిలో మోసపోతున్న బాధితులు
- ఆందోళన చెందుతున్న నిరుద్యోగులు


గల్ఫ్ ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులు (ఫైల్)

బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన ఇద్దరు, మరో గ్రామానికి చెందిన యువకుడు కలిసి న్యూజిలాండ్ వెళ్లేందుకు నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఏజెంట్‌కు రూ.9 లక్షలు ముట్టజెప్పారు. సదరు ఏజెంట్ వారికి నకిలీ వీసాలు చేతిలో పెట్టాడు. అప్పుడుఇప్పుడు అంటూ ఏడాది కాలంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు.

జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు, రాయికల్ మండలం తాట్లవాయికి చెందిన మరో యువకుడు కలిసి స్నేహితుల ద్వారా నిజామాబాద్‌లోని మోర్తాడ్ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన ఓ గల్ఫ్ ఏజెంట్‌కు రూ.2లక్షలు అప్పగించారు. రెండు నెలలుగా దుబాయ్ పంపించకుండా.. డబ్బులు తిరిగి ఇవ్వకుండా యువకులనే బ్లాక్‌మెయిల్ చేస్తూ.. బెదిరింపులకు పాల్పడుతున్నాడు.

జగిత్యాలక్రైం: ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే వారి సంఖ్య జిల్లాలో రోజురోజుకూ పెరుగుతుండడంతో అదునుగా తీసుకున్న కొంతమంది ట్రావెల్స్, గల్ఫ్ ఏజెంట్లు పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నారు. వీరు రెండేళ్లుగా యువకులను మోసగిస్తూనే ఉన్నారు. అనుమతులు లేకుండా జిల్లాలో సుమారు 180 ట్రావెల్స్‌లు నడుస్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో గ్రామీణప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులకు విదేశీల్లో ఉపాధి కల్పిస్తామని గల్ఫ్ ఏజెంట్లు ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్నారు. జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాలతో పాటు 20 మండలాల్లో గల్ఫ్ ట్రావెల్స్ పేరున సుమారు 180 ట్రావెల్స్ నిర్వహిస్తున్నారు. వాస్తవానికి వీరు విమాన టికెట్స్ బుకింగ్ చేసేందుకే అనుమతి తీసుకుంటారు. కానీ.. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని చెప్పి.. వారి పాస్‌పోర్టులు తీసుకుని ఇంటర్వ్యూలకు హాజరుపరుస్తూ.. వీసా వచ్చిందని నమ్మిస్తూ.. నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. అదే ట్రావెల్స్‌లలో ఎలాంటి అనుమతులు లేకుండా మనీ ట్రాన్స్‌ఫర్ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. నిరుద్యోగులు కూడా స్థానికంగా ఉన్న ట్రావెల్స్‌లను నమ్మి లక్షలాది రూపాయలు చేతిలో పెట్టి మోసపోతున్నారు.

30 మందికే లైసెన్స్‌లు

గల్ఫ్ పంపించేందుకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ నుంచి జిల్లాలో కేవలం 30 మంది ఏజెంట్లకు మాత్రమే లైసెన్స్ ఉంది. మిగతావారు అనుమతి లేకున్నా.. ట్రావెల్స్, ఏజెంట్లుగా చలామణి అవుతూ నిరుద్యోగుల నుంచి వీసాల పేరుతో పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారు.

లైసెన్స్ లేకున్నా ఇంటర్వ్యూలు

వాస్తవానికి గల్ఫ్ ఏజెంట్లు, ట్రావెల్స్ నిర్వాహకులు లైసెన్స్ ఉన్నా జిల్లాలోని ఎస్పీ పోలీసులకు సమాచారం అందించి ఇంటర్వ్యూలు నిర్వహించాలి. కానీ వారు పోలీసులకు ఎలాంటి సమాచారం లేకుండానే ఇష్టారీతిలో జిల్లాకేంద్రంతో పాటు, పలుచోట్ల హోటళ్లు, ఫంక్షన్‌హాల్స్, గెస్ట్‌హౌస్‌ల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్, ముంబయ్, చెన్నై, ఢిల్లీలో ఉన్న ట్రావెల్స్ యజమానులు వీరికి జత కలుస్తున్నారు. ఇంటర్వ్యూల్లో అర్హత సాధించారని పేర్కొంటూ పాస్‌పోర్టులు తీసుకుని అనంతరం వారికి ఏదో ఒక వీసా అప్పగించి మోసాలకు పాల్పడుతున్నారు.

యూరప్ దేశాలకూ ఇంటర్వ్యూలు

లైసెన్స్ ఉన్న ట్రావెల్స్ యజమానులు గతంలో గల్ఫ్ దేశాలకు మాత్రమే నిరుద్యోగ యువకులను పంపించేవారు. కానీ ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా లైసెన్స్‌లు ఉన్నవారు, లేని వారు యూరప్ దేశాల్లోనూ ఉద్యోగాలున్నాయంటూ సుమారు రూ.2 నుంచి రూ.5లక్షల వరకు వసూలు చేస్తున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం



గల్ఫ్ పంపిస్తామని మోసం చేసిన వ్యక్తులపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేస్తున్నాం. నకిలీ ఏజెంట్లకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దు. ఎమిగ్రేషన్ చట్టబద్ధత ఉన్న వారి నుంచే వీసాలు పొందాలి. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి గల్ఫ్ మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపడతాం.

– సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ